

కృత్రిమ కాళ్లు అమర్చేందుకు 36 మంది ఎంపిక

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్ ఆధ్వర్యంలో కృత్రిమ కాళ్లు అమర్చేందుకు గురువారం నిర్వహించిన స్క్రీనింగ్ క్యాంపులో 36 మందికి కాళ్లు అమర్చేందుకు ఎంపిక చేశామని ఆ క్లబ్ అధ్యక్షులు ఎస్.శశికాంత్ తెలిపారు. రోటరీ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ శిబిరానికి 40 మంది హాజరయ్యారని, వీరిలో 36 మందికి కృత్రిమ కాళ్లు అమర్చేందుకు ఎంపిక చేశామన్నారు. వారికి సరిపడా కృత్రిమ కాళ్ల సైజు కొలతలు తీసుకున్నామని తెలిపారు. మరో నలుగురు ఇటీవలే ఆపరేషన్ చేయించుకున్నందున, మరికొంత కాలం ఆగాల్సి ఉంటుందని వివరించామన్నారు. ఎంపిక చేసిన వారికి త్వరలో కృత్రిమ కాళ్లు అమరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు సజ్జా శశికాంత్, కార్యదర్శి మండా శ్రీనివాస్, పిడి వెంకట రత్నం, బోయపాటి ముఖర్జీ, అనిల్, లక్షణ స్వామి, రాజగోపాల్, మలిశెట్టి శ్రీనివాస్, పొట్లూరి ప్రసాద్, సాయి భాస్కర్, వెంకటేశ్వరరావు, సబ్బినేని శ్రీనివాస్, నరేంద్ర, లావు మురళీ పాల్గొన్నారు.

రూప్‌చంద్ ధర ఢమాల్..!

మేత, లీజు సొమ్ము సైతం రాని దుస్థితి - తీవ్ర ఆందోళనలో చేపల సాగుదారులు



మార్కెట్‌కు సిద్ధం చేస్తున్న రూప్‌చంద్ చేపలు

ప్రజాశక్తి - కాళ్ల

ఉప్పుటేరు, కొల్లేరు తీర ప్రాంతంలో చేపల సాగులో ముఖ్యమైన రూప్‌చంద్ ధర అత్యంత కనిష్టస్థాయికి పడిపోయింది. గత దశాబ్ద కాలంలో ఎన్నడూ ధర ఇంత దిగజారలేదని, ఈ ధర వల్ల రూప్‌చంద్ సాగు చేసే రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారు.

జిల్లాలో చేపల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పెరిగిన ఫీడ్, సీడ్ ధరలకు తోడు నకిలీ సీడ్‌తో చేపల సాగు కుదేలవుతోంది. ఇదే సమయంలో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర తగ్గించడంతో కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. ఈ పరిస్థితుల్లో చేపల సాగుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల్లో చేపల సాగు ఉంది. ప్రస్తుతం దిగుబడులు తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వేలాది ఎకరాల్లోని చేపల చెరువుల్లో కేజీన్నరకుపైగా బరువు పెరిగిన చేపలను పట్టుబడులు చేస్తున్నారు. ఆరు సంవత్సరాల నుంచి తెల్ల చేపలు సాగు చేస్తున్న రైతులు ఫీడ్ ధరలు అమాంతం పెరగడం, వ్యాపారులు కుమ్మక్కై ధరలు తగ్గించడంతో నష్టాలు చవి చూస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు చెబుతున్నారు.

కిలో చేపల ధర రూ.80 నుంచి రూ.90కు తగ్గిపోవడంతో కనీసం పెట్టుబడులు రావడం లేదని, కనీసం కిలో ధర రూ.125కు విక్రయిస్తేనే గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు. కొత్తగా కొంతమంది రెండేళ్ల నుంచి రూపచంద్ చేపలు సాగు చేస్తున్నారు. ఏడాదిపాటు లాభాలు ఆర్జించారు. రెండోయేట నుంచి కిలో రూ.100 నుంచి రూ.80కి ధర తగ్గిపోవడంతో నష్టాలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

ఎకరానికి రూ.40 వేలు నష్టం

రూప్‌చంద్ సాగు చేపట్టిన మొదట్లో కిలో వంద రూపాయలకు వ్యాపారులు కొనుగోలు చేయడంతో రైతులకు గిట్టుబాటయ్యేది. ప్రస్తుతం కిలో రూ.80కి తగ్గించడంతో ఎకరాకు రూ.40 వేల నష్టం వస్తున్నట్లు చెబుతున్నారు.

అధికారుల పర్యవేక్షణేదీ..!

జిల్లాలో వందల సంఖ్యలో ఫీడ్, కెమికల్స్ దుకాణాలు ఉన్నాయి. వీటిపై మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడి నకిలీ ఫీడ్, కెమికల్స్ రాజ్యమేలుతున్నాయని చేపల రైతులు ఆరోపిస్తున్నారు. ఫీడ్‌ను చేపలకు వేయడం వల్ల పెరుగుదల లేదని, దీంతో బరువు రాక నష్టాలు వస్తున్నాయని చెబుతున్నారు.

ధర పతనం

ఈ సంవత్సరం జూన్ చివర నుంచి రూప్‌చంద్ ధర పతనం కావడం ప్రారంభమైంది. రైతు వద్ద రూ.114, రూ.115 పలికిన చేప ధర పతనమవుతూ ప్రస్తుతం కనిష్ట స్థాయి రూ.80కు దిగజారింది. ఒక లారీకి పది టన్నుల సరుకు పడితే రైతుకు సుమారు రూ.1.50 లక్షలు నష్టం వస్తోంది. ఇలాగైతే సాగు ఎలా కొనసాగించగలమని రైతులు లబోదిబోమంటున్నారు. మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం ఈ ధర ఇంకా పతనమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇదే జరిగితే ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా ఆయకట్టు ప్రాంతంలో ఇక మీదట చేపల సాగుకు ప్రయత్నించలేదని దుస్థితి దాపురిస్తుందని వాపోతున్నారు.

అరువు లేదంటున్న ఫీడ్ కంపెనీలు, డీలర్లు

రూప్‌చంద్ చేప ధర కనిష్ట స్థాయికి చేరడంతో చేపలు పట్టడానికి రైతుల ముందుకు రావడం లేదు. గత సంవత్సర కాలం నుంచి చేపల చెరువులకు మేతల పెట్టుబడులు పెడుతున్న ఫీడ్ కంపెనీలు, డీలర్లు ఇక పెట్టుబడులు పెట్టలేక ఇబ్బందులు పడుతూ వెనుకంజ వేస్తున్నారు. ఫీడ్ కంపెనీలు, డీలర్లు మేతకు అరువు ఇవ్వకుండా సొమ్ము చెల్లిస్తేనే మేత పంపుతామని చెబుతున్నారు. ఇప్పటికే తాము చాలా సొమ్ము అరువుగా ఇచ్చామని, ఇక ఇవ్వలేమని, సొమ్ము చెల్లిస్తేనే మేత పంపగలమని తేల్చి చెబుతున్నారు. రెండు రోజులకోసారి మేత చల్లాల్సి ఉందని, ఈ విధంగానైతే చేప పెరుగుదల నిలిచి పోతుందని రైతులు ఆందోళన చెందుతుందన్నారు.

ధర పతనానికి కారణాలు

కార్తీక మాసం, షష్టి పండుగల ప్రభావమే రూప్‌చంద్ ధర తగ్గడానికి కారణమని ట్రేడర్స్ చెబుతున్నారు. మరో రెండు, మూడు నెలలు ఇదే పరిస్థితి ఉండవచ్చని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మార్కెట్‌కు వస్తున్న సరుకు ఎక్కువగా ఉండడం వల్ల ధర తగ్గుతుంది.

ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి..

మంతెన అంజనేయరాజు, ఆక్వా రైతు, ఏలూరుపాడు



కొంతకాలంగా రూప్‌చంద్ ధర పతనం రైతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా కేజీ రూప్‌చంద్ ధర రూ.80 నుంచి రూ.82 మధ్య కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక కేజీ రూప్‌చంద్ చేప తయారీకి సుమారు రూ.90 నుంచి రూ.95 వరకు ఖర్చవుతుండటంతో రైతు నష్టానికే పట్టుబడులు పట్టాల్సి వస్తోంది. ప్రభుత్వం ట్రేడర్స్‌తో చర్చలు జరిపి గిట్టుబాటు ధరకు చర్యలు తీసుకోవాలి.

ఫీడ్ ధరలు తగ్గించాలి..

కంతేటి శ్రీనివాసరాజు, ఆక్వా రైతు, ప్రాతళ్లమెరక



ఇటీవల కాలంలో చేప ధర బాగా పతనం కావడంతో గిట్టుబాటు కావడం లేదు. ఈ ధరకు కనీసం మేత ఖర్చులు, లీజు సొమ్ము రావడం లేదు. కరోనా సమయంలో కూడా ఇంత తక్కువ ధర లేదు. డీలర్లు మేత ఇవ్వనంటున్నారు. ప్రభుత్వ పెద్దలు ఫీడ్ కంపెనీలతో చర్చించి ఫీడ్ ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. ఒడిశాలో చెరువుల తవ్వకానికి అక్కడి ప్రభుత్వం రైతుకు సబ్సిడీలు అందించి పోత్సహిస్తోంది. ప్రభుత్వం ఆక్వా రంగాన్ని ఆదుకోవాలి.

నేడు మెగా పిటిఎం


నిర్వహణా ఏర్పాట్లపై కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్ష



ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల ఐదో తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ 3.0 నిర్వహణ ఏర్పాట్లపై ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత జులై 10న జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పిటిఎం 2.0 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. అదేరీతిలో ఈ నెల 5వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల విద్యా పురోగతి కోసం ప్రజల భాగస్వామ్యం, ముఖ్యంగా తల్లిదండ్రుల పాత్ర మెగా పిటిఎంలో కీలకమన్నారు. జిల్లాలోని 1748 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో దీన్ని నిర్వహించాలని, ఈ కార్యక్రమంలో లక్షా 19,397 మంది విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు పాల్గొంటారని తెలిపారు. అందుకు తగినవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని, తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజన కార్యక్రమం వరకూ సాగుతుందని తెలిపారు. సమావేశంలో డిఇఒ వెంకటలక్ష్మమ్మ, సమగ్ర శిక్ష ఎపిసి పంకజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిఎల్‌డిఒ కార్యాలయం ప్రారంభం



ప్రారంభోత్సవ శిలాఫలకం వద్ద కలెక్టర్, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సి

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక శనివారపుపేట సమీపంలో శ్రీరామనగర్‌లో ఏర్పాటు చేసిన డివిజనల్ అభివృద్ధి అధికారి (డిఎల్‌డిఒ) కార్యాలయాన్ని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గురువారం వర్చువల్‌గా ప్రారంభించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి), దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్, రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఓఎస్‌డి, జిల్లా నోడల్ అధికారి కె.ఆనంద్, జెడ్‌పి ఇన్‌ఛార్జి సిఇఒ బి.భీమేశ్వరరావు, డ్వామా ఎపిడి ఆర్.విజ్జర్, డిఆర్‌డిఎ పిడి ఆర్.విజయరాజు, డిఎల్‌డిఒ ఎబిపివి.లక్ష్మి, డివిజనల్ పంచాయతీ అధికారి వై.అమ్మాజీ, సంబంధిత శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు భీమడోలులో ఎంఎల్‌ఎచే జనవాణి

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు గ్రామ పంచాయతీ వేదికగా ఈ నెల ఐదో తేదీ ఉదయం ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు జనవాణి (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఆ పంచాయతీ కార్యదర్శి తనూజ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎంఎల్‌ఎ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ఆర్‌టిసి ఉద్యోగులపై అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలి

11వ రోజు కొనసాగిన నిరాహారదీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ఆర్‌టిసి పెట్రోల్ బంక్‌లో జరిగిన అవినీతితో సంబంధం లేని ఉద్యోగులపై విధించిన సస్పెన్షన్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆర్‌టిసి కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 11వ రోజుకి చేరాయి. 11వ రోజు దీక్షలో ఎస్‌కె.ఆసిఫ్, కెఎస్.రావు, బి.సుధీర్, విహెచ్.కార్తీక్, ఎంవిఆర్‌కె.రెడ్డి, కె.సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెఎసి నేత వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్‌టిసి



దీక్షలో పాల్గొన్న కార్మికులు, ఉద్యోగులు, నేతలు

ఉద్యోగులు, కార్మికుల ఆందోళనను యాజమాన్యం పట్టించుకోకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పెట్రోల్ బంక్‌లో జరిగిన రూ.82 లక్షల అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ఆర్‌టిసి యాజమాన్యం అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని, పెట్రోల్ బంక్‌లో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలని యాజమాన్యాన్ని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

గోపవరం ఆర్‌ఎస్‌కెను సందర్శించిన సబ్ కలెక్టర్ వినూత్న

ప్రజాశక్తి - ముసునూరు




మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వినూత్న

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందని నూజివీడు సబ్‌కలెక్టర్ బి.వినూత్న తెలిపారు. గురువారం మండలం పరిధిలోని గోపవరం రైతుసేవా కేంద్రాన్ని తహశీల్దార్ ప్రశాంతి, మండల వ్యవసాయ అధికారి ఎ.చాముండేశ్వరితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ రైతులందరికీ సకాలంలో గోనె సంచులు అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎవరికి వారే తమ పొలాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకుని అధిక తేమ శాతం లేకుండా, కనీసం 17 శాతం మించకుండా ఉండాలని సూచించారు. ధాన్యం కాటా వేసిన 24 గంటల్లో సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమవుతుందన్నారు. కార్యక్రమంలో డిటి వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

13న కలిదిండిలో ఆక్వా రైతుల జిల్లా సదస్సు

ప్రజాశక్తి - కలిదిండి

సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఆక్వా రైతుల సమస్యల పరిష్కారంపై చర్చించేందుకు ఈ నెల 13న కలిదిండిలో ఆక్వా రైతుల జిల్లాస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ బి.బలరాం, చేపల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నంబూరి వెంకటరామరాజు (తాడినాడ బాబు) అన్నారు. మండలంలోని తాడినాడ ఎఎస్‌ఆర్ నగర్‌లో ఆక్వా రైతుల జిల్లాస్థాయి సదస్సు కరపత్రాలను వారు గురువారం విడుదల చేశారు. తొలుత అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల వల్ల ఆక్వా రంగానికి తీవ్ర నష్టంతోపాటు సంక్షోభ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. వాటిని ఎదుర్కొనేందుకు ఆక్వా రైతులు, ఆక్వా రంగ నిపుణులు సదస్సులో పాల్గొనాలని కోరారు. ఆక్వా రంగాన్ని, రైతాంగాన్ని కాపాడుకునేందుకు చేస్తున్న కృషిలో భాగంగా సదస్సులో పాల్గొనేందుకు ఆక్వా రైతుసంఘాల రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు వస్తున్నారని, సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా నాయకులు కె.శ్రీనివాస్, మండల కార్యదర్శి ఎస్.మహంకాళిరావు విజ్ఞప్తి చేశారు. సదస్సులో భాగంగా ప్రజలతో కలిసి సిపిఎం కార్యకర్తలు పనిచేసేందుకు జిల్లాస్థాయిలో నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తాడి శ్రీనివాసరావు, కొత్తపల్లి బంగార్రాజు, కలిదిండి నాగరాజు, గాదిరాజు రమేష్‌రాజు, ఆర్.కృష్ణంరాజు, నంబూరి సుబ్రమణ్యంరాజు, చిన్నం రాజు, పెన్మత్స రామరాజు, రామకృష్ణరాజు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న రైతు నేతలు, రైతులు, సిపిఎం నేతలు

భూయజమానులు దళారులను ఆశ్రయించొద్దు

చింతూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



రికార్డులు పరిశీలిస్తున్న చంద్రశేఖర్, సిబ్బంది

పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిమిత్తం ఇచ్చే భూముల యాజమనులు దళారులను ఆశ్రయించొద్దని చింతూరు భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం భూసేకరణ కోసం జీలుగుమిల్లి, పూచికపాడు గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌డిసి మాట్లాడుతూ ఎటువంటి వివాదాలూ లేని జిరాయితీ భూములు మాత్రమే పోలవరం ముంపు నిర్వాసితులకు తీసుకుంటున్నామని అన్నారు. దీనిలో దళారులకు ఎటువంటి ప్రమేయం లేదని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని తెలిపారు. భూముల్లో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సరిచూసుకుని భూసేకరణకు దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు. మొత్తం ఏడువేల ఎకరాలు అవసరమవ్వగా, మండలవ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 950 ఎకరాల భూమి సేకరించినట్లు తెలిపారు. గ్రామ సభలో సర్పంచి చిర్రి జగదాంబ, ఆర్‌ఐ వీరాస్వామి, విఆర్‌ఓ తులసి, తిరుపతమ్మ, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



వినతి అందిస్తున్న కార్మిక నేతలు

మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు, డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.బాలరాజు, సిఐటియు మండల కన్వీనర్ పసల సూర్యారావు మాట్లాడుతూ కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు. ఎన్‌ఎంఆర్ కార్మికులకు ఏడేళ్లుగా పెంచని జీతాల పెంపు, క్లాప్ డ్రైవర్లకు నెల జీతాల చెల్లింపు, చెత్త వాహన డ్రైవర్లకు జిఒ ఎంఎస్ నెం.36 ప్రకారం రూ.24,500 చెల్లింపు, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు తదితర డిమాండ్లు అమలు చేయాలన్నారు. వయోపరిమితిని 62 ఏళ్లకు పెంపు, పట్టణ విస్తరణ మేరకు కార్మికుల సంఖ్య పెంపు, పని భారం తగ్గింపునకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సురేష్, రామారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఇంటిగ్రేటెడ్ లేబరేటరీ

మత్స్య అభివృద్ధి శాఖాధికారి నీలాపు దుర్గాభవాని

ప్రజాశక్తి - భీమడోలు



అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న దుర్గాభవాని

భీమడోలు కేంద్రంగా మత్స్య శాఖ ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ లేబరేటరీ సేవలను వినియోగించుకోవాలని భీమడోలు మత్స్య అభివృద్ధి శాఖాధికారి నీలాపు దుర్గాభవాని కోరారు. ఆక్వా రైతులకు అవగాహన కల్పించేందుకు మత్స్య అభివృద్ధి శాఖాధికారి తన బృందంతో కురెళ్లగూడెంలో గురువారం పర్యటించారు. చేపల చెరువులను పరిశీలించారు. ఒక ఆక్వా రైతుకు చెందిన చెరువు వద్ద నీటి నమూనా పరీక్షలను నిర్వహించారు. ఆక్వా రైతులు, మత్స్యకారుల శ్రేయస్సుతోపాటు మత్స్య సంపద అభివృద్ధి లక్ష్యంగా మత్స్య శాఖ పలు కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పలు రాయితీ పథకాలను అమలు చేస్తుందని వివరించారు. ఇదే క్రమంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, దాని అనుబంధ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మత్స్య శాఖకు చెందిన ల్యాబ్ టెక్నీషియన్లు, సిబ్బందితోపాటు పలువురు ఆక్వా రైతులు పాల్గొన్నారు.

త్వరలో 1050 కొత్త బస్సులు

ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.ద్వారకాతిరుమలరావు

జంగారెడ్డిగూడెం డిపోలో తనిఖీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



ఆర్‌టిసి బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్‌డి

త్వరలో 1050 కొత్త బస్సులు రానున్నాయని ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.ద్వారకాతిరుమల రావు తెలిపారు. స్థానిక జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి డిపోను ఆయన గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్త్రీ శక్తి పథకం అమలు ఎలా ఉంది, బస్సులు సరిపోతున్నాయా, బస్సుల ఫిట్‌నెస్ ఎలా ఉంది అనే వివరాలు డిపో మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పల్లె వెలుగు బస్సులు కూడా కొత్తవి త్వరలో రానున్నాయన్నారు. బస్టాండ్‌లోని కొంతమంది ప్రయాణికులు బస్టాండ్‌లో ఆర్‌ఒ ప్లాంట్ పెట్టాలని, భీమవరం బస్సు మరొకటి ప్రారంభించాలని కోరారు. దీనిపై ఎమ్‌డి స్పందిస్తూ త్వరలోనే ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఇప్పుడున్న కొన్ని పల్లె వెలుగు బస్సులు పదేపదే మరమ్మతులకు గురవుతుండటంతో వాటి స్థానంలో త్వరలోనే కొత్త బస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలు బస్సుల్లో సంతోషంగా ప్రయాణిస్తున్నారన్నారు. త్వరలో వికలాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ప్రభుత్వం యోచిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్ గంగాధర్‌రావు, ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సైనికుల కుటుంబాల సంక్షేమానికి సహకరించాలి

ప్రజాశక్తి - ఏలూరు



విరాళం అందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

మాజీ సైనికుల కుటుంబాల సంక్షేమానికి ప్రజలు స్వచ్ఛందంగా పెద్దమనస్సుతో ముందుకు రావాలని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా వాల్ పోస్టరు, స్టిక్కర్లను ఆమె ఆవిష్కరించారు. కలెక్టర్ సాయుధ దళాల పతాక నిధికి మొదటి విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత సైనికదళాల దేశభక్తి, సాహసం, త్యాగాల పట్ల దేశం గర్విస్తోందన్నారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్‌లోను, ప్రకృతి వైపరీత్యాల సమయంలోను ఎనలేని సేవలందించారని గుర్తు చేశారు. ఎంతోమంది సైనికులు దేశ రక్షణ విధుల్లో తమ ప్రాణాలను అర్పించారన్నారు. సాయుధ దళాల పతాక నిధికి తమవంతుగా ప్రతిఒక్కరూ విరాళాలు అందజేస్తే వారి కుటుంబాలకు ఎంతో సహాయ పడుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి ఎస్.కొండలరావు, ఎక్స్‌జెడబ్ల్యుఒ డివి.రామయ్య, ఎ.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతులు

ప్రజాశక్తి - పోలవరం



నేతల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి

పోలవరం ప్రాజెక్టు పర్యటనకు వచ్చిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి గురువారం పోలవరం కూటమి నేతలు మండలంలో పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మంత్రి వాటికి సానుకూలంగా స్పందించి సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ పోలవరం మండలంలో ఇసుక కాలువకు గడిచిన వర్షాలకు పడిన గండ్లు పూడ్చాలని, శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, కడెమ్మ కాలువ పూడికతీత, జంగిల్ క్లియరెన్స్, మంగళవారి కురివిడి, జోడిమళ్ల కురివిడి, కర్రిపంపు బోదె చెక్ డ్యామ్ నిర్మాణ పనులు, కృష్ణారావుపేట బాడవ రోడ్డు నుండి గాడాల చెరువుకి రోడ్డు పొడిగించాలని, కామాయమ్మ తూము మరమ్మతులు, కొత్తూరు చెరువు పూడికతీత, గట్టు గ్రావెల్ రోడ్డు నిర్మాణం, జంగిల్ క్లియరెన్సు పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కన్నాపురం అడ్డరోడ్డు వద్ద నిలిచిన పట్టిసీమ నూతన పంపింగ్ స్కీమ్ నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు మంగిన కొండ, కొత్తూరు చెరువు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు పాదం ప్రసాద్, పట్టిసీమ సొసైటీ అధ్యక్షులు నునకాని రాంబాబు, నల్లా రాంబాబు, బెజవాడ గోపి, ఆకుల రాజా పాల్గొన్నారు.

పంట, మురుగు కాలువల ప్రక్షాళన పనులు

పెదగొన్నూరు డిసి ఛైర్మన్ గుడిసేవ సురేష్ బాబు



ప్రజాశక్తి - ముదినేపల్లి

పెదగొన్నూరు డిసి పరిధిలోని ఉన్న పంటకాలువలు, మురుగు కాలువల ప్రక్షాళన పనులు చేపట్టామని పెదగొన్నూరు డిసి ఛైర్మన్ గుడిసేవ సురేష్ బాబు తెలిపారు. పెదగొన్నూరులో ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. పెదగొన్నూరు డిసి పరిధిలో వైవాక, కొచ్చర్ల, పెదగొన్నూరు, కోమర్రు, చేవూరు, సాగునీటి సంఘాలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గతంలో పంట కాలువలలోనూ, మురుగు కాలువల్లోనూ గుర్రపుడెక్క, తూడు, ప్లాస్టిక్ వ్యర్థాలు మేట వేసి కాల్వలో నడిచి వెళ్లేలా ఉండేదని, దానివల్ల భారీ వర్షాలు కురిస్తే పంట పొలాలు ముంపునకు గురై రైతాంగం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడేదని చెప్పారు. నేడు పంట కాలువలు, మురుగు కాలువలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రక్షాళన చేయించడం వల్ల ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం తగ్గిందన్నారు. పెదగొన్నూరు డిసి పరిధిలో ఉన్న 32 గ్రామాల్లో 30 వేల ఎకరాలున్నాయన్నారు. ఆ గ్రామాల ప్రజలకు ప్రతిఒక్కరికీ స్వచ్ఛమైన శుద్ధ జలాలు అంది స్తున్నామన్నారు. పంట కాలువలు, మురుగు కాలువల్లో అవరోధాల తొలగింపు కార్యక్రమాలు చేయడం ద్వారా నీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తలేదన్నారు. కైకలూరు ఎంఎల్ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రోత్సాహంతో పెదలంక డ్రయిన్‌లో పేరుకుపోయిన కిక్కిస తొలగింపు పనులు తొమ్మిది కిలోమీటర్ల పొడవునా సుమారు రూ.28 లక్షలతో చేశామన్నారు. దీంతో ఆయకట్టు రైతుల కష్టాలు తొలగిపోయాయన్నారు.




పెదలంక డ్రెయిన్‌లో పనులను పరిశీలిస్తున్న సురేష్‌బాబు (ఫైల్ ఫొటో)

చినగొన్నూరు సర్ ప్లస్ నుంచి అవకూరు వరకు కాలువలో గుర్రపు డెక్క నివారణకు రసాయనాలతో పిచికారీ పనులు చేశామన్నారు. వి.రావిగుంట నుంచి వాడవల్లి వరకు రెండు కిలోమీటర్ల పొడవునా మీడియం డ్రెయిన్‌లో పనులు రూ.మూడు లక్షలతో చేశామన్నారు. పెదలంక-అన్నవరం డ్రెయిన్‌లో పనులు రూ.నాలుగు లక్షలతో చేపట్టామన్నారు. సంకర్షణపురం వద్ద అన్నవరం డ్రెయిన్‌కు వచ్చే వేసవిలో తూములు ఏర్పాటు చేస్తామన్నారు. క్యాంపు బెల్ పంట కాలువలో మట్టి తవ్వకం పనులు చేయాల్సి ఉందన్నారు. చిన్నగొన్నూరు నుంచి గుడ్లవల్లేరు వరకు ఎగువన నాలుగు కిలోమీటర్ల మేర ఇసుక మేటలు వేసిందన్నారు. ఈ ఇసుక మేటలు వేసవిలో తొలగించేందుకు ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. రెండో పంట దాళ్వా, వరి సాగు లేదని, దీంతో రైతులు ఆరుతడి పంటలు చేపట్టేందుకు సిద్ధం కావాలని తెలిపారు.

డిఎల్‌డిఒ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి సభ్యులు

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేసిన డిఎల్‌డిఒ నూతన కార్యాలయాలను జంగారెడ్డి గూడెంలో గురువారం ప్రారంభించారు. జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య, టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, పరిమి సత్తిపండు, రాజాన పండు, పడాల ప్రసాద్ పాల్గొన్నారు.

సత్యనారాయణ మృతికి సంతాపం

ప్రజాశక్తి - చింతలపూడి

లింగపాలెం మండలంలోని మఠంగూడెం గ్రామానికి చెందిన చింతలపూడి సమితి మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మండలపు సత్యనారాయణ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ సత్యనారాయణ స్వగృహానికి వెళ్లి పూలమాల వేసి అంజలి ఘటించారు. బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని సమ్మెట్లవారిగూడెంలో నయిల్ రేఫిలింగ్ స్టేషన్ (పెట్రోల్ బంక్)ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రసాయన విపత్తు నివారణపై అవగాహన

ప్రజాశక్తి - కామవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన విభాగం ఆధ్వర్యంలో రసాయన విపత్తు నివారణ మార్గాలు అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి డిజిటల్ మాధ్యమం ఖహూత్ ద్వారా క్విజ్ పోటీ నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ రసాయన విపత్తులపై అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఆదినారాయణ, ధారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, ఎం.విజయలక్ష్మి, పి.కళ్యాణ్ పాల్గొన్నారు.

వికలాంగుడికి ఆదిత్య చౌదరి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని గురజలో గత ఏడేళ్లుగా పెన్షన్‌కు నోచుకోని తాడిగుడి రంగారావుకు చల్లగుళ్ల ఆదిత్య చౌదరి టిడిపి గ్రామ నాయకులతో కలిసి ఆర్థిక సాయం అందించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రంగారావుకు గురువారం ఆదిత్య చౌదరి రూ.5వేల నగదును అందించారు. త్వరలో పింఛన్ వచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు అల్లినేని వెంకటేశ్వరరావు, వీరిశెట్టి కొండలరావు, టిడిపి నాయకులు దావు నాగరాజు, బత్తుల రవి, అర్జా శివనాగరాజు, చేడిక పవన్, ఆదుసుమిల్లి రాము, టి.స్వామి, ఎ.వెంకటేశ్వరరావు, భైరవస్వామి యేసు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ఆదిత్యచౌదరి

ఘనంగా వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

విభిన్న ప్రతిభావంతులు అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తు బంగారు బాటలు వేసుకోవాలని ఆగిరిపల్లి ఎంఇఒ-1 ఆర్.హేబేలు అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగిరిపల్లి జెడ్‌పి హైస్కూల్‌లో ఉన్న భవిత కేంద్రంలో వికలాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి ఎంఇఒ-2 కె.ఆనంద్‌కుమార్, జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.పుష్పలత, రాకేష్, రజని పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

అంగన్‌వాడీ కేంద్రంలో జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు విజయకృష్ణ తనిఖీలు

ప్రజాశక్తి - కామవరపుకోట

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ అన్నారు. మండలంలోని కొండగూడెం కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానికుల మేరకు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిశీలన సమయంలో అంగన్‌వాడీ టీచర్, వర్కర్, పిల్లలు లేరని గుర్తించారు. పిల్లలకు గుడ్లు, పాలు పంపిణీ చేయకపోవడం, వంట కూడా చేయకపోవడం, కేంద్రంలో సరుకులు, కూరగాయలు లేకపోవడం, పిల్లలు ఉండాల్సిన చోట మంచం వేసి ఉండడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితిని పూర్తిగా పరిశీలించి, బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అంగన్‌వాడీ అధికారులను ఆదేశించారు.

ఘనంగా వైద్య కళాశాల స్నాతకోత్సవం

ప్రజాశక్తి - దెందులూరు

ఎస్‌ఆర్ హోమియోపతిక్ మెడికల్ కాలేజీలో గురువారం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏలూరు రేంజ్ ఐజి జివిజి అశోక్‌కుమార్ విచ్చేశారు. 11వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి షేక్ సికిందర్ భాషా, డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, ఎస్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఛైర్మన్ డాక్టర్ ఆకుల విజయసర్జన్, ఎస్ఆర్ హోమియోపతిక్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ అనంద కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జ్యూట్‌మిల్లు కార్మికులకు న్యాయం చేయాలి

కేంద్ర మంత్రికి ఏలూరు ఎంపీ వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు, కొత్తూరులో మూతపడిన శ్రీకృష్ణ జ్యూట్ మిల్ కారణంగా నిరుద్యోగులైన దాదాపు ఐదు వేల మంది కార్మికులకు తక్షణ న్యాయం చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కేంద్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయను కోరారు. జూట్ మిల్లు మూసివేతతో ఇబ్బందులు పడుతున్న కార్మికుల సమస్యలను, వారికి రావాల్సిన ఇఎస్ఐ, నిధుల్లో భృతిని వెంటనే మంజూరు చేయాలని ఎంపీ వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

నేరాలు - ఘోరాలు

కలుపు మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కలుపు మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రాజుపోతేపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన కనుమూరి రాయప్ప (60) మద్యానికి బానిసై ఏ పని చేయకుండా కుటుంబ అవసరాలు పట్టించుకోకుండా తిరుగుతూ బుధవారం మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య మందలించింది. మనస్తాపంతో కలుపు మందు తాగాడు. కుటుంబ సభ్యులు చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి చేర్పారు. మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని భార్య కనుమూరి అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.జయబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సిఆర్‌ఎంటిల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కామవరపుకోట

ప్రభుత్వం సిఆర్‌ఎంటిల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలో ఆయా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఎంఇఒ డి.సుబ్బారావుకు, డిప్యూటీ తహశీల్దార్ సౌజన్యకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2012 నుంచి పనిచేస్తున్న సిఆర్‌ఎంటిలు 2016 పిఎబి ప్రకారం జీతాలు చెల్లిస్తున్నందున పెరిగిన జీవన ప్రమాణాన్ని పరిగణలోకి తీసుకుని జీతాలు పెంచి ఎంటిఎస్ లేదా హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ ఇవ్వాలని, ఎపి క్లస్టర్ల ప్రతిపాదనను విరమించుకోవాలని, సిఆర్‌ఎంటిలను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, ట్రావెలింగ్ ఎలవెన్స్ మంజూరు చేయాలని, పిఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మల్ల నాగేశ్వరరావు, బలరాం, శర్మ సత్యనారాయణ, ఆచారి, కె.శ్రీనివాస్. ఎం.శివప్రసాద్, సిఆర్‌ఎంటిలు పి.కమలాకర్, కె.కరుణ, సుందరి, ఎం.విజయలక్ష్మి, ఎం.నిర్మల కుమారి పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా సిఎం సహాయ నిధి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అవసరార్థులకు ఆర్థిక చేయూతనందించేందుకు సిఎం సహాయ నిధి ఎంతగానో దోహదపడుతుందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బారు ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అదే విధంగా అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు బాధితులకు సిఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఏలూరు ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల వద్ద నుంచి ప్రజాదర్బార్ కార్యక్రమంలో వారి వినతులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనారోగ్యంతో బాధపడుతున్న 22 మంది బాధితులకు సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.13.81 లక్షల విలువైన చెక్కులను ఎంఎల్‌ఎ అందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నేటివరకూ ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో దాదాపుగా రూ.నాలుగు కోట్లను అవసరార్థులకు సిఎం సహాయ నిధి ద్వారా అందించినట్లు చెప్పారు. దీనిద్వారా సుమారు 385 మంది బాధితులకు న్యాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, టిడిపి ఏలూరు నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కార్యదర్శి రెడ్డి నాగరాజు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, డివిజన్ ఇన్‌ఛార్జులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన రోశయ్య వర్ధంతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య వర్ధంతి వేడుకలను ఆగిరిపల్లి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గురువారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు సిహెచ్.వెంకటరత్నం, వై.చంద్రశేఖర్, కె.శ్రీనివాసరావు, వై.రాంబాబు, జె.కోటేశ్వరరావు, వై.రమేష్, కె.ముక్తేశ్వరరావు, వై.నరసింహారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - దెందులూరు

ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారానికి సంబంధిత అధికారులు ప్రత్యేక కృషి చేయాలని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో గురువారం ఉదయం పలువురు నియోజకవర్గ కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వాన పత్రికలను పుష్పగుచ్ఛాలను అందించారు. ఈ సందర్భంగా పలు నియోజకవర్గాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రూ.180 కోట్ల చెక్కు అందజేతపై హర్షం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం సాధించటానికి తోడ్పాటు అందిస్తున్న సిఎం చంద్రబాబుకు కలెక్టర్‌కు, డిఆర్‌డిఎ పీడీకి, స్త్రీ నిధి డైరెక్టర్‌కు తోట కృపామణి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గంలోని గొల్లగూడెంలో జిల్లా మహిళలు రూ.180 కోట్ల చెక్కును సిఎం తమకు అందించారని కృపామణి తెలిపారు. జిల్లాలో 22,580 మంది మహిళలకు లబ్ధి చేకూరే ఈ చెక్కును ఇవ్వడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. రూ.295 కోట్ల జిల్లా వార్షిక ప్రణాళికలో రూ.180 కోట్లు మహిళల ఆర్థిక స్వావలంభన కార్యక్రమాలు తమ ప్రాజెక్టు డైరెక్టర్ అమలు చేస్తున్నార న్నారు. జిల్లా మహిళా సమాఖ్య ద్వారా చేపల పెంపకం వ్యాపారం వల్ల వచ్చిన లాభాలు రూ.2.47 లక్షల చెక్కు కూడా తాము సిఎం ద్వారా అందుకున్నామని తెలిపారు. ఈ విధంగా మహిళా గ్రూపులను ప్రోత్సహిస్తున్న రాష్ట్ర సెర్ప్ సిఇఒ కరుణ, కలెక్టర్ వెట్రిసెల్వి, స్త్రీ నిధి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ హరిప్రసాద్, జిల్లా డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్.విజయ్ రాజులకు కృపామణి ధన్యవాదాలు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ సబ్జెక్ట్ నిపుణులు, విద్యావేత్తలతో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థుల ప్రయోజనార్థం ఏలూరు నగర శాఖ ఆధ్వర్యంలో నగరంలో ఉన్న 12 ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గురువారం భోజన విరామ సమయంలో అందించారు. నగరంలోని ఎఆర్‌డిజికె, మాకా, గాంధీనగర్, సుబ్బమ్మ దేవి, సెంట్ థెరీసా, కెపిడిటీ, కస్తూరిబాయ్, ప్రభుత్వ బాలుర, బాలికల, తూర్పు వీధి ఉన్నత పాఠశాలలకు టీచర్ కాపీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావు మాట్లాడుతూ సాధారణ విద్యార్థులు కూడా 80 శాతం పైనే మార్కులు తెచ్చుకునేలా సులువుగా ఉండే పద్ధతిలో ఈ స్టడీ మెటీరియల్ రూపొందించినట్లు చెప్పారు. ప్రతి ఉపాధ్యాయుడు ప్రతి విద్యార్థి ఈ స్టడీ మెటీరియల్ ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నగర గౌరవ అధ్యక్షులు ఎం.చిట్టిబాబు, ఉపాధ్యక్షులు కె.దొరబాబు, ఆర్.రాజేశ్వరి, కోశాధికారి కోరాడ కిరణ్‌కుమార్, జిల్లా కౌన్సిలర్లు కెవి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ యూనివర్సిటీ భవనానికి అంతర్జాతీయ గుర్తింపు



గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న వెంకట్రావు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నూతనంగా నిర్మించిన యూనివర్శిటీ బిల్డింగ్‌నకు అంతర్జాతీయ గుర్తింపు లభించినట్లు ఎన్ఆర్ఐ గ్రూప్ ఆఫ్ కాలేజీస్ ఛైర్మన్ రావి వెంకట్రావు తెలిపారు. మలేషియాలో ఒక స్టార్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన ఎఐ గ్లోబల్ ఆర్కిటెక్చర్, బిల్డర్స్ అవార్డు కార్యక్రమంలో ఛైర్మన్ వెంకట్రావు, సివిల్ ఇంజినీర్ సిహెచ్. చంద్రశేఖం శ్రీనివాస్‌లు గుర్తింపు పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల సిఇఒ ఎం.తేజ్‌సాయి మాట్లాడుతూ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఎఐ క్లాస్ రూమ్స్, సెంట్రలైజ్డ్ ఎయిర్ కండిషన్‌తో ఆధునాతన వసతులతో, కార్పొరేట్ సంస్థల భవన సముదాయాలకు ధీటుగా యూనివర్శిటీ బిల్డింగ్‌ను నిర్మించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, పలు విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పెంచలయ్య కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలి

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - పోలవరం

నెల్లూరు నగరంలో గంజాయికి వ్యతిరేకంగా పోరాడినందుకు గంజాయి ముఠా చేతిలో అత్యంత కిరాతకంగా హత్యకు గురైన కె.పెంచలయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ డిమాండ్ చేశారు. మండలంలోని ఇటికలకోట గ్రామంలో పెంచలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పెంచలయ్య స్ఫూర్తితో ఆయన ఆశయ సాధన కోసం డ్రగ్స్‌కు, గంజాయికి వ్యతిరేకంగా పోరాటం సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తామా బాలరాజు, కొమరం పోసిరత్నం, సముద్రాల సాయికృష్ణ, ధర్ముల లక్ష్మి, ఎం.నాగు, వీరయమ్మ, ఇంద్రవతి, సుధారాణి, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

నూతన బస్సు సర్వీస్ ప్రారంభించాలి

ఆర్‌టిసి బస్సును అడ్డుకుని విద్యార్థుల నిరసన

సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు ఎంఎల్ఎ చింతమనేని వినతి

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మండలానికి చెందిన రామసింగవరం, కూచిపూడి, పెదవేగి సహా సమీప గ్రామాల విద్యార్థులు అనేకమంది ప్రతిరోజూ ఏలూరుకు ఆర్‌టిసి బస్సులో వచ్చి నగరంలోని పలు విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ప్రతిరోజూ ఉదయం రంగాపురం నుంచి ఏలూరు వచ్చే బస్సు మాత్రమే వీరికి అందుబాటులో ఉండటం, అది కూడా రంగాపురంలోనే పూర్తిగా ప్రయాణికులతో నిండిపోవటంతో రామసింగవరం, కూచింపూడి, పెదవేగి సహా సమీప గ్రామాల విద్యార్థులు కనీసం బస్సు ఎక్కే అవకాశం కూడా లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం విద్యార్థులు బస్సును అడ్డుకుని నిరసన తెలిపారు. స్థానిక కూటమి నాయకుల ద్వారా విద్యార్థుల సమస్యను తెలుసుకున్న దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ విద్యార్థులతో కలిసి ఏలూరులోని కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని విద్యార్థులతో కలిసి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందించారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్యార్థుల ప్రయాణ సమస్యను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని, రామసింగవరం నుంచి ఏలూరుకు రేపటి నుంచి బస్సు సర్వీస్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు.

యాచకురాలి నిజాయితీకి సిఐ అభినందన

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు జంక్షన్‌లో ఉన్న బస్టాండు దాని పరిసర ప్రాంతాల్లో చిన్న పిల్లతో భిక్షాటన చేసుకునే యాచకురాలి నిజాయితీని భీమడోలు సిఐ యుజె.విల్సన్, ఎస్ఐ మదీనాభాషా అభినందించారు. కాకినాడ జిల్లా కొండలరావు ప్రాంతానికి చెందిన జువ్వల సత్యనారాయణ ప్రయాణంలో భాగంగా భీమడోలు బస్టాండ్‌లో గురువారం మధ్యాహ్నం దిగారు. ఇదే సమయంలో తన జేబులో ఉన్న రూ.36 వేల నగదు గల్లంతైనట్లు గుర్తించారు. భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త లేని కారణంగా తన చిన్న పిల్లతో యాచకం చేసుకుంటూ జీవిస్తున్న తిరుమల శెట్టి కరుణ అనే మహిళకు ఆ సొమ్ములు దొరికాయి. వాటిని తీసుకున్న యాచకురాలు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సదరు తనకు దొరికిన తీరు వివరిస్తూ ఆ సొమ్మును పోలీసులకు అప్పగించింది. పోలీసులు సొమ్ము పోగొట్టుకున్న వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి యాచకురాలి చేతుల మీదిగా సొమ్ము పోగొట్టుకున్న వ్యక్తికి అందించారు. యాచకురాలి నిజాయితీని భీమడోలు పోలీసులతో పాటు, సొమ్ములు పోగొట్టుకుని తిరిగి పొందిన సత్యనారాయణ అభినందించారు.

సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి గ్రామాభివృద్ధికి సహకరిస్తున్నారని టిడిపి కోర్లకుంట యూనిట్ కన్వీనర్ పొట్లూరి మహేంద్రవర్మ లక్ష్మీప్రసన్న తెలిపారు. మండల పరిధిలోని కోర్లగుంట గ్రామం శివారు సింహాద్రిపురంలో సీసీ రోడ్డుకు రూ.22 లక్షలు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు మరో రూ.20 లక్షల నిధులు మంజూరు చేసినందుకు గ్రామస్తులతో కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



మాట్లాడుతున్న మహేంద్రవర్మ లక్ష్మీప్రసన్న

నాగలక్ష్మి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - టి.నరసాపురం

పంచాయతీ ప్రజలకు నాగలక్ష్మి అందించిన సేవలు అభినందనీయమని బండివారిగూడెం సర్పంచి నాళం టిరీషా, కాశీలు అన్నారు. స్థానిక సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి ఉద్యోగోన్నతిపై గ్రామ వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపిడిఒగా బదిలీ అయిన ఎల్.నాగలక్ష్మిని టిరీషా, కాశీ దంపతులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంకిత భావంతో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. సన్మాన గ్రహీత నాగలక్ష్మి మాట్లాడుతూ సచివాలయాల అభివృద్ధితో పాటు సచివాలయాల ద్వారా ప్రజలకు అందించే సేవలు పూర్తి స్థాయిలో అందేలా చూస్తానని తెలిపారు. ఉద్యోగోన్నతి మరింత బాధ్యత పెంచిందన్నారు. బండివారి గూడెం పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన కాలంలో సహక రించిన సర్పంచి టిరీషా కాశీ దంపతులకు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంద్రెడ్డి సత్యనా రాయణ, సాధు పెంటయ్య, వాసిరెడ్డి రామ్మోహన్‌రావు, జోనుబోయిన రాంబాబు, పాపోలు పూర్ణ, సాయి, నాగేంద్ర, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 3.0

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 3.0 కార్యక్రమం ఈ నెల ఐదో తేదీ శుక్రవారం మొత్తం 1,748 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో భారీగా నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1,19,397 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. నూజివీడు జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పాల్గొంటారని చెప్పారు.

7న జిల్లా సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల ఏడో తేదీన ఏలూరులో జరుగుతున్న జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఎపి వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కుందేటి జయరాజు పిలుపునిచ్చారు. స్థానిక స్ఫూర్తి భవనంలో వికలాంగుల సంక్షేమ సంఘం ఏలూరు కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల మూడో తేదీన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఎపి వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకు జిల్లాలో వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దానిలో భాగంగా ఏడో తేదీన జిల్లా కేంద్రమైన ఏలూరు పట్టణంలో శ్రీ కాశీ విశ్వేశ్వర కళ్యాణమండపంలో జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనెగుంట్ల కోటేశ్వరరావు, ముఖ్యవక్తలుగా విజువల్లి చాలెంజు డు, ఎంప్లాయిస్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు, కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ జి.రవీంద్రబాబు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్‌కుమార్, జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఎంఎస్.రాజు పాల్గొంటున్నారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పెదవేగి

పెదవేగి, లింగపాలెం మండలాల్లో 132 కెవి పెదవేగి సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నిమిత్తం ఈ నెల ఐదో తేదీ శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ సమయంలో పెదవేగి, కూచింపూడి, రామసింగవరం, కవ్వగుంట, గుడిగుంట, విజయరాయి, జానంపేట, బాపిరాజుగూడెం, రాయుడుపాలెం, అయ్యప్పరాజుగూడెం, ధర్మాజీగూడెం, నరసన్నపాలెలం, ఆసన్నగూడెం గ్రామాలకు వెళ్లే 33 కెవి లైన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ గృహ, వ్యాపార వినియోగదారులు సహకరించాలని తెలిపారు. వ్యవసాయ కరెంటు ఉదయం ఐదు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆలయ భూమి స్వాధీనం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో ఉన్న శ్రీ సీతారామ స్వామి ఆలయానికి చెందిన భూమిని అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ నెంబర్ 121/2లో ఉన్న 9.41 సెంట్ల కొబ్బరి తోట గత 60 సంవత్సరాలుగా ఆక్రమణలో ఉండగా భూమిని తిరిగి దేవాదయ శాఖ అధీనంలోకి తీసుకున్నారు. ఈ స్వాధీనం కార్యక్రమంలో జిల్లా ఎండోమెంట్స్ అధికారి కూచిపూడి శ్రీనివాస్, కార్యనిర్వాహణాధికారులు ఎ.రవిశంకర్, జి.పవన్‌కుమార్, గోకుల తిరుమల పారిజాతగిరి, సంబంధిత సిబ్బంది, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు. సుమారు రూ.20 కోట్ల విలువైన ఈ భూమిని తిరిగి దేవాలయానికి రప్పించడం ముఖ్య విజయంగా అధికారులు తెలిపారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం

ప్రజాశక్తి - కామవరపుకోట

పంచాయతీలో ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి వి.రవినాయక్ అన్నారు. స్థానిక చౌతన సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద రహదారికి ఇరువైపులా ఆక్రమణలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. అనంతరం పంచాయతీ పారిశుధ్య సిబ్బందితో అక్కడ ఎటువంటి చెత్తా చెదారం లేకుండా శానిటేషన్ పనులు చేయించారు.